



రాజేంద్రచోళుడి నాణేన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

నీటి నిర్వహణకు చోళ రాజులే ఆద్యులు

- రాష్ట్రంలో రాజరాజచోళుడు, రాజేంద్రచోళుడి విగ్రహాలు
- గంగైకొండచోళపురం సభలో ప్రకటించిన ప్రధాని మోదీ

చెన్నై, ఆంధ్రజ్యోతి

ప్రపంచంలో ప్రధానాంశంగా ఉన్న నీటి నిర్వహణకు చోళరాజులే ఆద్యులని, రాజరాజ చోళుడు, ఆయన తనయుడు రాజేంద్రచోళుడి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వ రాలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మొదటి రాజేంద్ర చోళుడి ఆడి తిరువాదిరై (ఆషాఢ ఆరుద్ర) జయంత్యుత్సవాలు, బృహదీశ్వరాలయ శంకుస్థాపన సహస్ర వార్షికోత్స వాలు, రాజేంద్రచోళుడు ఆగ్నేయాసియా దేశాలపై జరిపిన దండయాత్ర సహస్రవార్షికోత్సవాల పేరిట త్రివిధ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న మోదీ 'వణక్కమ్ చోళ మండలం' అని సంబోధిస్తూ 'నమశ్శివాయ వాళ్గ, నాథన్ తాళ్ వాళ్గ ఇమ్మైపొళుదుమ్ ఎన్ నెంజిల్ నీంగాదాన్ వాళ్గ (నమశ్శివాయ వర్ధిల్లాలి... ఈశకీర్తి వర్ధిల్లాలి, నా గుండెలో తిష్టవేసుకున్న ఈశ్వరుడు వర్ధిల్లాలి) తమిళంలో శివుడిని స్తుతిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా పరమశివుడిని కీర్తిస్తూ చేసిన గానం ఈ వర్షాకాలంలో భక్తిని ప్రవహింపజేసి అందరినీ ఆనందింపజేసిందని మోదీ కొనియాడారు. కాశీనగర ప్రతినిధిగా ఉన్న తనను ఈ శివఘోష పారవశ్యానికి గురిచేసిందన్నారు.. శివుడిని ఆరాధించేవారంతా శివైక్యం చెందుతారని, అంతటి కీర్తిని సంతరించుకున్న ఆవుడయార్‌ను దర్శించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. రాజరాజచోళుడు, రాజేంద్రచోళుడు భారతదేశం గర్వించదగ్గ చిరస్మరణీయమైన చిహ్నాలన్నారు. చోళ సామ్రాజ్యమే ప్రజా స్వామ్యానికి పుట్టిల్లని, అందరూ చెబుతున్నట్లు బ్రిటిష్ దేశం దాని పుట్టిల్లు కాదన్నారు. ప్రజా ప్రతినిధులను ఎన్నికల ద్వారా ఎన్నుకున్న ఘనత చోళరాజులకే దక్కుతుందన్నారు. రాజేంద్ర చోళుడు గంగాజలాలను తీసుకొచ్చి ఇక్కడి పొన్నేరిలో నింపాడని, తాను కాశీ నగర ప్రతినిధిగా గంగాజలాన్ని తీసుకు వచ్చి ఆవుడయార్‌కు సమర్పించానని చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో తమిళ భాష ప్రతిధ్వనించిందని, తమిళ సంస్కృతిలో మమేకమైన సెంగోల్ ఆ భవనంలోనే స్థాపితమైందన్నారు. నేటి భారతం గత కాలపు కీర్తిని, చరిత్రను చూసి గర్వపడుతోందన్నారు. భారతదేశం నుండి అపహరించిన ప్రాచీన శిల్పాలను తీవ్ర ప్రయత్నాల నడుమ స్వదేశానికి తీసుకొచ్చామని, వాటిలో 36 ప్రాచీన శిల్పాలు తమిళనాడుకు చెందినవే ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలంతా ఆపరేషన్ సిందూర్ గురించి గొప్పగా చెప్పుకుంటున్నారని, భద్రతకు ముప్పు కలిగిస్తే ప్రతీకారం ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ చక్కటి ఉదాహరణ అని అన్నారు.



రోడ్‌షో... : శనివారం రాత్రి తిరుచ్చిలో బసచేసిన ప్రధాని మోదీ ఆదివారం ఉదయం గంగైకొండ చోళపురానికి హెలికాప్టర్‌లో బయలుదేరారు. గంగైకొండ చోళపురానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో చోళగంగం వద్ద హెలిపాడ్‌లో దిగిఅక్కడి కారులో బయలుదేరి ఆలయం వరకూ మోదీ రోడ్‌షోలో పాల్గొన్నారు. మోదీ కారు ఫుట్‌బోర్డ్‌పై నిలిచి రహదారికి ఇరువైపులా ఉన్న బీజేపీ, అన్నాడీఎంకే కార్యకర్తలు, స్థానికుల వైపు చేతులు ఊపుకుంటూ వెళ్ళారు. హెలిపాడ్ వద గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు తదితరులు స్వాగతం పలికారు.



రోడ్‌షోలో మోదీపై పూల వర్షం కురిపిస్తున్న ప్రజలు

ఎగ్జిబిషన్ సందర్శన...

గంగైకొండ చోళపురం వద్ద కేంద్ర సాంస్కృతిక శాఖ చోళ చక్రవర్తుల చారిత్రక విశేషాలపై ఏర్పాటు చేసిన చిత్రపటాల ప్రదర్శనను కూడా మోదీ వీక్షించారు. గంగైకొండ చోళపురం ఆలయ మహల్‌లో ఉన్న శిల్పాలు, కళాత్మక వస్తువులను తిలకించారు. చోళుల కాలం నాటి రాగి ఫలకాలను కూడా పరిశీలించారు. అనంతరం ఆలయ ముఖ మండపం, మహా మండపం, అర్థమండపాన్ని తిలకించారు. ఈ కార్యక్రమాలనంతరం ఆలయం నుండి కారులో బయలుదేరి చోళగంగం హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్నారు. తిరుచ్చి నుండి వాయుసేన విమానంలో మోదీ ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

గంగైకొండ చోళపురం ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు

అరియనల్లూరు జిల్లా గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వరాలయంలో ఆదివారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ సందర్భంగా పెరియ ఆవుడయార్ (మహా లింగేశ్వరుడికి)కు దీపారాధన చేశారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ఓదువార్లు (తమిళ శివ గీతాలను గానం చేసేవారు) పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలోకి మోదీ గంగాతీర్థ కలశంతో వెళ్లి మూలవిరాట్టుకు సమర్పించారు. ఆలయ శివాచార్యులు మోదీకి పూల మాల వేసి, ప్రసాదాలు అందజేశారు. ఆవుడయార్ దర్శనానంతరం ఆలయంలో ఇతర సన్నిధుల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆస్పత్రి నుంచి సీఎం స్టాలిన్ డిశ్చార్జి

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సీఎం స్టాలిన్ ఈ నెల 21వ తేది వాకింగ్ చేస్తున్న సమయంలో, హఠాత్తుగా కళ్లు తిరిగాయి. దీంతో, ఆయనను థౌజండ్ లైట్స్‌లోని అపోలో ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న సమయంలోనే, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యమంత్రికి హృదయ సంబంధిత సమస్యలున్నట్లు గుర్తించిన వైద్యులు, యాంజిగ్రామ్ చేసినట్లు ఆస్పత్రి నుంచి బులెటన్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, చికిత్స ముగించుకుని సీఎం స్టాలిన్ ఆదివారం సాయంత్రం డిశ్చార్జి అయ్యారు. మూడు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం యధావిధిగా ప్రభుత్వ విధులకు హాజరు కావచ్చని వైద్యులు సూచించారు. ఆస్పత్రి నుంచి వెలుపలికి వచ్చిన ముఖ్యమంత్రికి పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ ఆహ్వానించారు.



కారులో నివాసానికి బయలుదేరిన సీఎం స్టాలిన్‌కు నమస్కరిస్తున్న మంత్రులు

భారత స్వావలంబనకు ఆపరేషన్ సిందూర్ నిదర్శనం

- గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

అడయార్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారత సైనిక దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ భారత స్వావలంబనకు గొప్ప నిదర్శనమని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అభిప్రాయపడ్డారు. జాతీయ ప్రత్యామ్నాయాలకు బహుళ విభాగ విధానం ఎలా దోహదపడుతుందో ఆపరేషన్ సిందూర్ విజయం మంచి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు ఉన్నత విద్యా ఉపాధ్యాయ సంఘం (టీహెచ్ఈటీఏ), అఖిల భారత రాష్ట్రీయ శైక్షిత్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), చెన్నై వీఐటీ సంయుక్తంగా 'వికసిత్ భారత్ కార్యాచరణ ప్రణాళిక-బహుళ రంగాల విధానం' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల సదస్సు ఆదివారంతో ముగిసింది. వీఐటీ వ్యవస్థాపకులు, చాన్సలర్ డాక్టర్ కె.విశ్వనాథన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన గోవా సీఎం ప్రమోద్ సావంత్ ప్రసంగిస్తూ, సంస్కృతి సంప్రదాయాలతో పాటు విజ్ఞానం పుష్కలంగా ఉన్న రాష్ట్రం తమిళనాడని కొనియాడారు. చోళులు వంటి గొప్ప పాలకుల పాలించిన ఈ రాష్ట్రం కంబరామాణుడికి జన్మస్థలం అని, సుపరిపాలన వారసత్వానికి ప్రసిద్ధ చెందిన భూమి అని పేర్కొన్నారు. వచ్చే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక దాడి మాత్రమే కాదని, జాతీయ భద్రత కోసం శాస్త్ర సాంకేతిక, వ్యూహం, వేగవంతమైన నిర్ణయాలు ఎలా కలిసి పనిచేయవచ్చో రుజువు చేసిందన్నారు. ఈ సదస్సులో వీఐటీ చాన్సలర్ జీవీ సెల్వం, యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్, గాంధీగ్రామ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్ వైస్ చాన్సెలర్ దిండిగల్ ప్రొఫెసర్ ఎన్.పంచనాథమ్, ఏబీఆర్ఎస్ఎం అఖిల భారత కార్యనిర్వాహక కార్యదర్శి గుంత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గోవా సీఎంను సన్మానిస్తున్న విశ్వనాథన్ తదితరులు

మోదీ జీ.... రూ.2152 కోట్ల విద్యానిధులు విడుదల చేయండి

- సీఎం స్టాలిన్ డిమాండ్

అడయార్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావాల్సిన రూ.215.59 కోట్ల పెండింగ్ నిధులను తక్షణం విడుదల చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో 2018 నుంచి సమగ్ర శిక్ష అభియాన్ పథకం విజయవంతంగా అమలవుతోందన్నారు. అయితే, 2020లో జాతీయ నూతన విద్యా విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టి, దాన్ని అమలు చేయాలని కోరగా, ఆ విధానంలోని కొన్ని అంశాలపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశామన్నారు. ఎస్ఎస్‌ఏ పథకంలో చదివే అనేక మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2151.59 కోట్ల పెండింగ్ నిధులను, 2025-26 సంవత్సరానికి తొలి దశ నిధులను తక్షణం విడుదల చేయాలని కోరారు. పీఎం శ్రీ అవగాహనా ఒప్పంద పత్రాలపై సంతకం చేయాలంటూ నిబంధన పెట్టరాదని సీఎం స్టాలిన్ కోరారు. అలాగే, పదేళ్ళ క్రితం ఆమోదించి ఇప్పటి వరకు అమలు చేయని సెంజి - తిరువణ్ణామలై రైలు మార్గం (70 కిలోమీటర్లు), ఈరోడ్ - పళని ప్రాంతాల మధ్య 70 కిలోమీటర్ల రైలు మార్గం, మదురై - తూత్తుక్కుడి ప్రాంతాల మధ్య 60 కిలోమీటర్ల రైలు మార్గం, అత్తిపట్టు - పుత్తూరుల మధ్య 88 కిలోమీటర్ల రైలు మార్గం, చెన్నై నుంచి మహాబలి ప్రాంతం లో కడలూరు వరకు 180 కిలోమీటర్ల రైలు మార్గాల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని, వీటిని తక్షణం అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే, 87 కిలోమీటర్ల తిరువనంతపురం - కన్నియాకుమారి ప్రాంతాల మధ్య రెండో రైలుమార్గం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. కోవై, మదురై నగరాల అభివృద్ధి, చెన్నై మెట్రో రైల్ విస్తరణ, మదురై, కోవై మెట్రో రైల్ ప్రాజెక్టుల అమలుకు కేంద్రం అనుమతివ్వాలని కోరారు. కోవై మెట్రో రైల్ పథకానికి రూ.10,740.49 కోట్లు, మదురై రైల్ ప్రాజెక్టుకు రూ.11,368.35 కోట్లతో పూర్తి చేసేందుకు డీపీఆర్‌ను తయారు చేసినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు ఆమోదం తెలుపడంతో పాటు కేంద్రం కూడా తన వంతు నిధులను ఇవ్వాలని సీఎం స్టాలిన్ కోరారు.

సీఎం స్టాలిన్, విజయ్ నివాసాలకు బాంబు బెదిరింపులు

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముఖ్యమంత్రి స్టాలిన్, తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్ ఇళ్లతో పాటు విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌తో వెళ్లి తనిఖీలు చేశారు. వెప్పేరిలోవున్న గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌కు ఆదివారం ఉదయం ఫోన్ చేసిన ఆగంతకుడు ఆళ్వార్‌పేటలోవున్న సీఎం స్టాలిన్ ఇంట్లో బాంబు పెట్టినట్లు బెదిరించి ఫోన్ కట్ చేశాడు. వెంటనే డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకున్న బాంబ్ స్క్వాడ్ ఆధునిక పరికరాలతో తనిఖీ చేసి బాంబు లేదని, ఇది కేవలం వదంతులు మాత్రమేనని నిర్ధారించారు. అదేవిధంగా నీలంగరైలో సినీ నటుడు విజయ్ ఇంట్లో కూడా సుమారు గంటకు పైగా తనిఖీ నిర్వహించిన పోలీసులు బాంబు లేకపోవడంతో ఇది కూడా వదంతేనని నిర్ధారించారు. కాగా, విజయ్ ఇంట్లో బాంబు ఉందని బెదిరించిన వ్యక్తి విల్లుపురం జిల్లా మరక్కానంకు చెందిన భువనేశ్వరన్ అని విచారణలో స్పష్టం కావడంతో అతడిని అరెస్టు చేసే ప్రయత్నాల్లో పోలీసులు దిగారు.

విదేశాల నుంచి ఈ-మెయిల్

త్రిశూలం ప్రాంతంలోని అంతర్జాతీయ విమానాశ్రయ మేనేజర్ గదికి గుర్తుతెలియని వ్యక్తి విదేశాల నుంచి పంపిన ఈమెయిల్‌లో ఆ విమానాశ్రయ మరుగుదొడ్లలో శక్తివంతమైన నైట్రిక్-9 అనే ఆర్డీఎక్స్ బాంబు పెట్టామని, అది ఏ క్షణంలోనైనా పేలుతుందని బెదిరించారు. ఈ వివరాలను తనిఖీ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఆ ఈమెయిల్ నకిలీ ఐడీ ద్వారా పంపించినట్లు గుర్తించారు. అయినప్పటికీ విమానాశ్రయ ప్రాంగణాల్లోని వీఐపీ విశ్రాంతి గదులు, రన్‌వే, విమానాలకు ఇంధనం నింపే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఇది కూడా వదంతి మాత్రమేనని నిర్ధారించారు. ఈ బెదిరింపుపై విమానాశ్రయం ప్రాంగణంలోని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టారు. ఇదిలా వుండగా, ప్రయాణికుల లగేజీ తనిఖీ కారణంగా ఇక్కడినుంచి బయలుదేరాల్సిన దుబాయి, సింగపూర్, హాంకాంగ్, శ్రీలంక, దోహా, షార్జా తదితర విదేశీ విమానాలు సుమారు గంట ఆలస్యంగా బయలుదేరాయి.

కావేరి-గోదావరి అనుసంధానానికి నిధులు కేటాయించండి

- ప్రధానిని కోరిన ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కావేరి-గోదావరి నదుల అనుసంధాన పథకానికి నిధులు కేటాయించాలని, తదితర మూడు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అందజేశారు. రాష్ట్రానికి రెండ్రోజుల పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని తిరుచ్చి విమానాశ్రయంలో శనివారం రాత్రి అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శులు కేపీ మునిస్వామి, నత్తం విశ్వనాథన్, మాజీమంత్రులు ఎస్పీ వేల్‌మణి, కామరాజ్‌లతో ఈపీఎస్ కలిసారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని ప్రధానికి ఈపీఎస్ సమర్పించారు. అందులో రైతులకు సిబిల్ స్కోర్ లేని రుణాలు అందించాలి, గోదావరి-కావేరి అనుసంధానం పథకానికి నిధులు విడుదల చేయాలి, రాష్ట్రంలో సైనికాయుధాల ఉత్పత్తి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే మూడు కోర్కెలను పరిశీలించిన ప్రధాని వాటిని వీలైనంత త్వరలో పరిష్కరింపజేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఈపీఎస్ మీడియాకు తెలిపారు. ప్రధానితో ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలు, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ కూటమి తరుపున చేపట్టాల్సిన ప్రచార అంశాలు, ఇతర పార్టీలను కూటమిలో చేర్చుకోవడం తదితరాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.



ప్రధానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఈపీఎస్

తిరుమల శ్రీవారి సేవలో హైకోర్టు సీజే

తిరుమల, జూలై27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సీజేకు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని చీఫ్ జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు సీజేకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.



ఆలయం వద్ద చీఫ్ జస్టిస్ ఎం.ఎం. శ్రీవాస్తవ

పద్యం... తెలుగు భాషకు మకుటాయమానం

చేగొండి వీరవెంకట సత్యనారాయణ మూర్తి

వేళచ్చేరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుకు వెలుగు తెచ్చింది పద్యమని తెలుగు భాషకు అది మకుటాయమానమని వేద విజ్ఞాన వేదిక కార్యక్రమంలో పాల్గొన్న చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. నగరంలోని వేద విజ్ఞాన వేదిక ప్రతినెలా నిర్వహించే 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 163వ ప్రసంగంలో భాగంగా పాలకొల్లుకు చెందిన విశ్రాంత ప్రధానాచార్యులు చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి 'తెలుగు పద్య వైభవం' అనే అంశంపై ప్రసంగించారు. ఆదివారం సాయంత్రం ఆంధ్రా క్లబ్ కృష్ణాహాలు లో జరిగిన జరిగిన ఈ కార్యక్రమం అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నెల్లుట్ల శ్రీనివాసులు రచించిన 'తలపుల పుంత' సప్తపదుల కవితా సంపుటిని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే.రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సంస్థ కార్యదర్శి కందనూరు మధు స్వాగతం పలకగా, వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే.రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. వక్త ఎంఏ పట్టాపొందారు. ఆయన పద్యగానకళలో అత్యంత ప్రతిభావంతులు, 'ఆంధ్ర సంస్కృతి వైభవం' సీడీని అమెరికాలో విడుదల చేశారు. నాటక సమాజాన్ని స్థాపించి ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. అంతేకాక ఆయన ప్రఖ్యాత సినీ రచయిత అనంత శ్రీరామ్ తండ్రి కూడా. చేగొండి సత్యనారాయణమూర్తి తన కుమారుడితో కలిసి తన గ్రామాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని వివరించారు.. జేకే.రెడ్డి పద్యాలు ఆలపించిన అనంతరం వక్తకు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం జేకే రెడ్డి నెల్లుట్ల శ్రీనివాసులు రచించిన తలపుల పుంత కవితా సంపుటి విశిష్టత వివరించారు. తర్వాత జేకే.రెడ్డి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ తొలిప్రతిని స్వీకరించారు. చేగొండి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, తెలుగు ప్రాంతీయ భాషే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గౌరవం కలిగిన మధురమైన భాష అని, పద్యం దానికి మకుటాయమానమని తెలిపారు. తెలుగుకు వెలుగులు ఇచ్చింది పద్యమేనని ఆయన పేర్కొన్నారు. అనంతరం నన్నయ రచించిన భారతంలో మొదటి తెలుగు పద్యాన్ని గానం చేసి శ్రోతలను పరవశుల్ని చేశారు. తిక్కన రచించిన భారతంలోని 'ఒరులేవి యొనరించిన' పద్యాన్ని గానం చేసి అది వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినదిగా తెలిపారు. ఎర్రన రచించిన నృసింహ పురాణంలోని పద్యాన్ని కర్ణపేయంగా ఆలపించారు. తర్వాత శ్రీనాథుడు రచించిన శృంగార నైషధంలోని హంసరాయబారంలోని చక్కటి పద్యాన్ని వివరిస్తూ మధురాతి మధురంగా వినిపించారు. పోతన రచించిన భారతంలోని పద్యాలను వినిపించారు. ప్రాచీన కవులతో ప్రారంభించి, ప్రబంధకవులలో ముఖ్యులైన అల్లసాని పెద్దన, రామరాజ భూషణుడు వంటి కవుల విరచిత గ్రంథాల్లోని పద్యాలను గానం చేశారు. ఆధునిక కవిత్వానికి సంబంధించిన కొన్ని కవితలను గానం చేశారు. ఆద్యంతం వక్త గానలహరి శ్రోతలను ఎంతగానో అలరించాయి. కార్యదర్శి మధు వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.



వక్త సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు

మేట్టూరు డ్యాంకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

కావేరి తీరప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరిక

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో సెకనుకు 60.400 ఘనపుటడుగుల నీరు చేరుతున్న నేపథ్యంలో, డ్యాం భద్రత దృష్ట్యా జలవనరులశాఖ అధికారులు 16 గేట్లను ఎత్తి నీరు విడుదల చేస్తుండటంతో కావేరి పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగింది. దీంతో వరద సంభవించే ప్రమాదం ఉన్నదని గ్రహించిన అధికారులు ఆదివారం ఉదయం కావేరి తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పెరుగు రాష్ట్రమైన కర్ణాటక, కేరళలోని వైనాడులో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడి డ్యాంలు పూర్తి సామర్థ్యంతో నిండాయి. డ్యాంల నుంచి మిగుల జలాలను కావేరి నదీ కాలువలో విడుదల చేస్తున్నారు. దీంతో మేట్టూరు డ్యాంలో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఆదివారం ఉదయం డ్యాం నుంచి సెకనుకు లక్ష ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కావేరి తీరప్రాంతాలైన సేలం, ఈరోడ్, నామక్కల్, అరియలూరు, కరూర్, తంజావూరు, తిరువారూర్, మైలాడుదురై, నాగపట్నం, కడలూరు జిల్లాల్లోని ప్రజలను జిల్లా కలెక్టర్లు అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు మెట్టప్రాంతాలకు వెళ్ళాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా నీటిలోకి దిగి స్నానాలు చేయడం, సెల్ఫీలు తీసుకోవడం చేయరాదని హెచ్చరించారు. అలాగే పశువులకు స్నానాలు చేయించరాదని, బట్టలు ఉతకరాదని దండోరా వేయించారు.



మేట్టూరు డ్యాం గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీరు

ఇదిలా వుండగా మేట్టూరు అగ్నిమాపకశాఖ అధికారి వెంకటేశన్ నేతృత్వంలో వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక సిబ్బంది కావేరి తీరప్రాంతాల్లో మకాంవేశారు. రాష్ట్రప్రభుత్వం కోరిక మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు చెందిన 60 మంది రెండు బృందాలుగా విడిపోయి, స్థానిక పోలీసులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొననున్నారు.

సమాచార దర్శిని

మద్రాసు హైకోర్టుకు ఆర్‌టీఐ వెబ్‌సైట్

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టుకు ఆర్‌టీఐ వెబ్‌సైట్ చిరునామా ప్రకటించారు. ఈ మేరకు మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ ఎస్.అల్లి విడుదల చేసిన ప్రకటనలో... మద్రాసు హైకోర్టు, జిల్లా కోర్టుల నుంచి సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరేలా https://mhc.tn.gov.in/eservices/rti అనే వెబ్‌సైట్ పరిచయం చేశామన్నారు. ఈ సైట్ వినియోగించేందుకు సూచనలు మద్రాసు హైకోర్టు సైట్‌లో వెల్లడించామని రిజిస్ట్రార్ తెలిపారు.

నేడు శ్రీవిల్లిపుత్తూరులో రథోత్సవం

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరులోని ఆండాళ్ ఆలయంలో సోమవారం ఆడిపూరం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఆలయంలో ఆడి మాసం సందర్భంగా ఆడిపూరం కోలాహలంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆ రీతిలో శనివారం రాత్రి ఆండాళ్-రంగమన్నార్ ఊంజల్ సేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం ప్రధాన వీధుల మీదుగా సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఏఐసీటీఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సాంకేతిక విద్యా కోర్సుల్లో మహిళలను ప్రోత్సహించేలా అఖిల భారత సాంకేతిక విద్యా కౌన్సిల్ (ఏఐసీటీఈ) 'ప్రగతి విద్య ఉపకార వేతనం' పరిచయం చేసింది. ఈ పథకంలో ప్రతి ఏడాది ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరిన, అర్హత కలగిన పదివేల మందిని ఎంపిక చేసి, వారు ఉన్నత విద్య అభ్యసించేలా ఏడాదికి రూ.50వేల ఉపకారవేతనం అందజేస్తోంది. ఇది మినహా, 'సాక్ష్యం' పథకంలో దివ్యాంగులు, 'స్వనాథ్' పథకంలో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి రూ.50,000 ఉపకారవేతనం అందిస్తుంది. ఉపకార వేతనం కోసం https://scholarships.gov.in అనే వెబ్‌సైట్‌లో అక్టోబరు 31లోపు దరఖాస్తులు సమర్పించాలి. వివరాలకు /www.aicteindia.org/ అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

16లోపు 'సీఎం ట్రోఫీ' పోటీలకు పేర్ల నమోదు

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రీడాభివృద్ధి సమాఖ్య, చెన్నై జిల్లా యంత్రాంగం సంయుక్తంగా 'సీఎం ట్రోఫీ' క్రీడా పోటీలు ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 12వ తేది వరకు నిర్వహించనున్నాయి. ఈ ఏడాది కొత్త పోటీలు చేర్చారు. పాఠశాల, కళాశాల, ప్రభుత్వ ఉద్యోగులు, దివ్యాంగులు, ప్రజలు ఇలా ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. పాఠశాల స్థాయిలో 19 ఏళ్లలోపు, కళాశాల స్థాయిలో 25 ఏళ్లలో వున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. ప్రజల విభాగంలో 15-35 ఏళ్లు, ప్రభుత్వ ఉద్యోగులు, దివ్యాంగులకు వయోపరిమితి లేదు. ఆసక్తిగల వారు https://cmt-rophy.s-dat.in, amp: https:// sdat.tn.gov.in అనే వెబ్‌సైట్లు, 7401703480 అనే నెంబరులో ఆగస్టు 16లోపు పేర్ల నమోదుచేసుకోవాలని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రామ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న 151 గ్రామ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో.. జిల్లాలో ఆవడిలో నాలుగు, గుమ్మిడిపూండిలో 22, పల్లిపట్టులో నాలుగు, పొన్నేరిలో 30, పూందమల్లిలో 21, ఆర్కే పేటలో 10, తిరుత్తణిలో 11, తిరువళ్లూర్‌లో 18, ఊత్తుకోటలో 31 అని మొత్తం 9 తాలూకాల్లో 151 గ్రామ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, స్వయంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. దరఖాస్తులను https://tiruvallur.nic.in/ అనే వెబ్‌సైట్, రెవెన్యూ అధికారి కార్యాలయానికి పోస్టు, స్వయంగా అందించవచ్చని కలెక్టర్ తెలిపారు.

జలాశయాల్లో 55 శాతం నీటి నిల్వలు

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగునీరందించే జలాశయాల్లో 55.95 శాతం నీటి నిల్వలున్నాయి. పూండి, పూళల్, చెంబరంబాక్కం, చోళవరం, తేర్వాయ్ కండిగై తదితర ఐదు జలాశయాల నుంచి నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11.757 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.579 టీఎంసీల నీరుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ప్రధానికి వ్యతిరేకంగా తిరుచ్చిలో కాంగ్రెస్ నిరసన

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి వ్యతిరేకంగా తిరుచ్చిలో ఆదివారం నల్లజెండాలతో నిరసన తెలిపిన కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురం వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని ప్రత్యేక విమానంలో తిరుచ్చి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన రాకను వ్యతిరేకిస్తూ తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పిలుపు మేరకు తిరుచ్చి జిల్లా అధ్యక్షుడు కళై నేతృత్వంలో 50 మందికి పైగా కార్యకర్తలు నిరసనలో పాల్గొనగా, పోలీసులు వారిని అరెస్టు చేసి, సాయంత్రం విడుదల చేశారు.

చర్చి, మసీదు, ఆలయాలకు ఒకే విద్యుత్ ఛార్జీలు

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చర్చి, మసీదు, ఆలయాలకు ఒకే విద్యుత్ ఛార్జీలు వసూలుచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రార్థనా స్థలాలకు విద్యుత్ ఛార్జీలు వసూలుచేయడంలో ప్రభుత్వం వ్యత్యాసం చూపుతోందని హిందూ మక్కల్ కట్చి అధ్యక్షుడు అర్జున్ సంపత్ ఇటీవల సామాజిక మాధ్యమాలు వేదికగా ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ అధికార సామాజిక మాధ్యమంలో విడుదల చేసిన ప్రకటనలోని వివరాలు ఇలా ఉన్నాయి... 2019లోనే ఆలయం, చర్చి, మసీదు సహా అన్ని వర్గాల ప్రార్థనా స్థలాలను 'ప్రజా ప్రార్థనా స్థలాలు'గా ప్రకటించి ఒకే రకమైన విద్యుత్ ఛార్జీలు వసూలుచేస్తున్నామన్నారు. 2024 ఛార్జీల ప్రకారం, ఆలయం, మసీదు సహా ప్రార్థనా స్థలాలకు యూనిట్ రూ.6.20 ఛార్జీగా నిర్ణయించామని, అందులో 1 నుంచి 120 యూనిట్ల వరకు ప్రభుత్వ సబ్సిడీగా రూ.3.13 అందజేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కేకే నగర్: వలసరవాక్కం, విరుగంబాక్కం, అళ్వార్‌తిరునగర్

తాంబరం: మాడంబాక్కం, వేంగైవాసల్, మప్పేడు, అగరంతెన్, పడువాంజేరి, కస్పాపురం, సెక్రటరియేట్ కాలనీ, క్యాంప్ రోడ్డు, సెంబాక్కం, అగరం మెయిన్ రోడ్డు, సేలయూర్, వీజీపీ శ్రీనివాస నగర్, వీజీపీ శరవణ నగర్, గాయత్రి నగర్, కృష్ణ నగర్, తిరువాంజేరి, నూతన్‌జేరి, గణపతి నగర్, జ్ఞానంద నగర్, భారతిదాసన్ నగర్, శక్తి నగర్, గాయత్రి గార్డన్, రాజకీల్పాక్కం కొంత భాగం, గౌరివాక్కం, సంతోష్‌పురం, రిక్కి గార్డన్, రాజాజీ నగర్, సుందరం కాలని, పరాశక్తి నగర్, సత్యసాయి నగర్, గోకుల్ నగర్, షా అవెన్యూ, కామరాజ్ నగర్, జయేంద్ర నగర్, తారంగేశ్వరి నగర్, కేవీఐసీ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, పళనియప్ప నగర్, శాంతమ్మాళ్ నగర్, విష్ణురాజపురం, విజయనగరం, కేకే రోడ్డు, శివగామి నగర్, పద్మావతి నగర్, అలమేలుపురం, కన్నన్ నగర్, ఇందిరా నగర్, చోళన్ నగర్, సుదర్శన్ నగర్, టియానా సై సిటీ, తిరుమల నగర్, అన్నై సత్యనగర్, గణేశ్ నగర్, మారుతి నగర్, శ్రీదేవి నగర్.

మే వరకు 28,675 ప్రమాదాలు

● 7,128 మంది మృతి

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది మే వరకు జరిగిన 28,675 రోడ్డు ప్రమాదాల్లో 7,128 మంది మృత్యువాతపడ్డారు. గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాలు, మృతుల సంఖ్య 12.7 శాతం వరకు తగ్గినట్లు ప్రభుత్వ రవాణా సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలో సంభవిస్తున్న ప్రమాదాలను తగ్గించేలా, రాష్ట్రస్థాయిలో అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల ద్వారా అధిక ప్రమాదాలు జరిగే ముఖ్యమైన రోడ్ల వివరాలు సేకరించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించేలా బోర్డులు, రాత్రి వేళల్లో మెరుస్తున్న స్పీడ్ బంప్‌లు ఏర్పాటుచేశారు. అలాగే, ప్రమాదాలు తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేపట్టారు. అందులో 2024 జనవరి నుంచి మే వరకు రాష్ట్రస్థాయిలో జాతీయ, రాష్ట్ర, జిల్లా రోడ్లలో 28,454 ప్రమాదాలు జరుగ్గా, 8,106 మంది మృతిచెందారు. అలాగే, ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు 28,657 ప్రమాదాల్లో 7,128 మంది మృతిచెందారు. 2024తో పోల్చితే ఈ ఏడాది ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గింది. అదే సమయంలో, గత ఏడాదితో పోల్చితే ఏడాది రోడ్డు ప్రమాదాలు 0.78 శాతం పెరగ్గా, మృతుల సంఖ్య 12.7 శాతం తగ్గింది. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు చెన్నైలో 1,671 ప్రమాదాలు జరుగ్గా, 197 మంది మృతిచెందారు. చెన్నై తర్వాత కడలూరులో 1,365 ప్రమాదాల్లో 224 మంది, విల్లుపురంలో 1,264 ప్రమాదాల్లో 222 మంది మృతిచెందారు. రాష్ట్రంలో నీలగిరిలో తక్కువగా 110 ప్రమాదాల్లో 21 మంది మృతిచెందారని అధికారులు తెలిపారు.

తిరుకడయూరులో నేత్రపర్వంగా ఆడిపూర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) సర్వాలంకరణతో స్వామివారు

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా తిరుకడయూరు అమృత ఘటేశ్వరాలయంలో ఆదివారం ఉదయం ఆడిపూర రథోత్సవం కనులపండువగా సాగింది. ధర్మపురం ఆధీనం ఆధ్వర్యంలోని అభిరామ అమ్మన్ సమేత అమృతఘటేశ్వరాలయంలో ఆడిపూర ఉత్సవాలు ఈ నెల 19న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం సందర్భంగా అభిరామి అమ్మవారు, చండికేశ్వరస్వామి, వినాయకస్వామి సర్వాలంకరణశోభితులై వేంచేశారు. భక్తులకు దర్శనమిచ్చిన అనంతరం దేవతామూర్తులను రథంలోని ప్రత్యేకపీఠంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత ఉదయం 9 గంటలకు వేలాదిమంది భక్తుల సమక్షంలో రథం బయలుదేరింది. భక్తులు రథానికి ఇరువైపులా మోకుతాళ్లను లాగుతూ వెళ్లారు. ఆలయ మాడవీధులలో ఊరేగిన తర్వాత ఉదయం 11 గంటలకు రథ మండప ప్రాంతానికి రథం చేరింది. ఈ వేడుకలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆధీనం ప్రతినిధి తంబిరాన్‌స్వామి, ఆలయ సూపరింటెండెంట్, ఆలయ గురుక్కళ్ తగిన ఏర్పాట్లు చేశారు.

అటవీ శాఖకు హైకోర్టు నోటీసు

● మురుగన్ విగ్రహం వ్యవహారం

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం మరుదమలైలో 184 అడుగుల మురుగన్ విగ్రహ పనులపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయమంటూ నోటీసు జారీ చేసింది. ఎస్.మురళీధరన్ అనే జంతు ప్రేమికుడు దాఖలు చేసిన పిటిషన్‌లో కోయంబత్తూరు అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరించే రహదారులకు చేరువగా ఉన్న మరుదమలై పర్యావరణ రీత్యా అత్యంత కీలకమైన ప్రాంతంగా ప్రభుత్వమే ప్రకటించిందని, అలాంటి చోట 1845 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు వనాలను తొలగించాల్సి ఉంటుందని, దీంతో ఏనుగుల సంచార మార్గం దెబ్బతింటుందన్నారు. అంతేకాకుండా ఆ విగ్రహం ఏర్పాటు కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి, అటవీ శాఖ అనుమతి కూడా పొందలేదని తెలిపారు. ఇదే విధంగా ఏనుగుల మరో సంచార మార్గమైన ఆనైక్కడి వద్ద చట్ట వ్యతిరేకంగా నడుపుతున్న రిసార్ట్‌ల మూసివేతకు ఉత్తర్వులివ్వాలని కూడా కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు ఎన్.సతీష్‌కుమార్, డి..భరత్ చక్రవర్తితో కూడి ధర్మాసనం అటవీశాఖ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఉత్తర్వు జారీ చేసింది.

'నీట్'లో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'నీట్' పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చినా, ప్రభుత్వ కోటా సీటు వస్తుందో? లేదా? అనే భయంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాంచీపురంలో చోటుచేసుకుంది. కాంచీపురం తిరుక్కాలిమేడు కామరాజర్ వీధికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ సాధిక్ కుమార్తె షమీమ్ (18) చిన్న కాంచీపురంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ ఉత్తీర్ణురాలై, 'నీట్'లో 502 మార్కులు సాధించింది. ఇటీవల ర్యాంకుల జాబితా విడుదలైన నేపథ్యంలో, తనకు ప్రభుత్వ కోటాలో సీటు వస్తుందా? లేదా? అనే భయాందోళనలో షమీమ్ ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇంట్లోని తన గదిలో ఫ్యానుకు ఉరేసుకుంది. కాంచీపురం తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయ కేసులో ఇద్దరి అరెస్ట్

వేలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు గంజాయి విక్రయించిన కేసులో ఆదివారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. చెన్నైలోని ఓ కళాశాలలో చదువుకుంటున్న నితీష్‌కుమార్ అనే విద్యార్థి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం అతడిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో నితీష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా వేలూరు జిల్లా ఎస్పీ మైల్వాహనం నేతృత్వంలోని ప్రత్యేక బృందం కళాశాల ప్రాంగణంలో నిఘా పటిష్టం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు తరణంపేటకు చెందిన బాసిల్, పేర్నాంబట్టుకు చెందిన సల్మాన్ అని తెలిసింది. వారినుంచి గంజాయి తరలిస్తున్న ఓ కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, ఈ గంజాయి విక్రయంలో ఇంకా ఎవరెవరు ఉన్నారన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు..

తెప్పోత్సవంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆగస్టు 14 నుంచి ప్రారంభం కానున్న ఆడి ఉత్సవాలకు సంబంధించి కలెక్టర్ ప్రతాప్ ఆదివారం సాయంత్రం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆడి ఉత్సవాల్లో భాగంగా ఆ నెల 16వ తేదీ సాయంత్రం ఆలయ పుష్కరిణిలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి తెప్పోత్సవం జరగనుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో కావళ్లతో వేలాది మంది భక్తులు కొండకు తరలివస్తారని, ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని, అదే విధంగా ఆలయ ప్రాంగణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రతాప్ అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు, తాగునీరు తదితర వసతులను కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వివేకానంద శుక్లా, ఆర్డీవో కనిమొళి, ఆలయ కమిషనర్ రమణి సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

10,661 రేషన్ దుకాణాల్లో యూపీఐ ద్వారా చెల్లింపులు

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 10,661 రేషన్ దుకాణాల్లో యూపీఐ ద్వారా నగదు చెల్లింపులు చేపట్టామని పౌరసరఫరాల శాఖ తెలియజేసింది. రాష్ట్రంలో సహకార శాఖ ఆధ్వర్యంలో 35,181 రేషన్ దుకాణాలు, తమిళనాడు వాణిజ్య వినియోగ సంస్థ ఆధ్వర్యంలో 1,527, ఇతర సహకార సంఘాల ఆధ్వర్యంలో 152, మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో 468 మొత్తం 37,328 రేషన్ దుకాణాలు పని చేస్తున్నాయి. ఈ దుకాణాల్లో 26,618 దుకాణాలు పూర్తికాలం, 10,710 దుకాణాలు పార్ట్ టైం పనిచేస్తున్నాయి. ఈ దుకాణాల ద్వారా 2,25,93,654 రేషన్ కార్డుదారులు సరుకులు పొందుతున్నారు. ప్రస్తుతం సహకార శాఖలో అన్ని విభాగాలను డిజిటలైజేషన్ చేపట్టారు. ఆ క్రమంలో, ప్రస్తుతం 10,661 రేషన్ దుకాణాల్లో యూపీఐ ద్వారా నగదు బదిలీ చేపట్టామని, త్వరలో అన్ని దుకాణాలకు విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు.

'సీఎం ఫార్మశీ'లో అన్ని రకాల మందులు

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'సీఎం ఫార్మశీ'లో వినియోగదారులు కోరే మందులు లేకపోతే, వాటిని కొనుగోలు చేసి అందించాలని సహకార శాఖ సూచించింది. ప్రజలు తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందించేలా, వెయ్యి సీఎం ఫార్మశీలను ఫిబ్రవరిలో సీఎం ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. వాటిలో 462 ప్రైవేటుగా, 563 సహకార సంఘాల ద్వారా పనిచేస్తున్నాయి. బీపీ, షుగర్, 'జనరిక్' మందులు బహిరంగ మార్కెట్ కంటే 75 శాతం వరకు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో, వినియోగదారులు కోరిన మందులు అందుబాటులో లేవనే ఫిర్యాదులందుతున్నాయి. ఈ విషయమై సహకార సంఘాల రిజిస్ట్రార్ నందకుమార్ మాట్లాడుతూ... సీఎం ఫార్మశీల్లో వినియోగదారులు కోరిన మందులు లేకపోతే సదరు మందుల కంపెనీని సంప్రదించి మందులు కొనుగోలు చేసి వారిని అందించాలని సూచించామన్నారు. అలాగే, జనరిక్ మందులు అధికంగా విక్రయించాలని, సీఎం ఫార్మశీలపై రేషన్ దుకాణాలు, సహకార బ్యాంక్‌లకు వచ్చే వినియోగదారులను తెలియజేయాలని అధికారులకు సూచించినట్లు రిజిస్ట్రార్ నందకుమార్ తెలిపారు.

ఐదు కిలోల మాదకద్రవ్యాల స్వాధీనం

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలపేటలో మెథాంఫిటమిన్ అనే మాదకద్రవ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో, ముత్యాలపేట, పిడారియార్ ఆలయ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి జంక్షన్‌లో శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన రెండు ద్విచక్రవాహనాలను అడ్డుకుని ఇద్దరు యువకులను విచారించారు. వారు పొంతన లేని సమాధానాలివ్వడంతో, వారి బ్యాగులు తనిఖీ చేసి, 5 కిలోల మెథాంఫిటమిన్ మాదకద్రవ్యం, రెండు ఐఫోన్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో చూలైకి చెందిన మహ్మద్ అలీ (55), ట్రిప్లికేన్‌కు చెందిన సయ్యద్ ఇబ్రహీం (50)ను అరెస్ట్ చేశారు.

క్యూఆర్ కోడ్‌తో భిక్షాటన!

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు సమీపంలోని వాణియంబాడికి చెందిన ఓ యాచకుడు క్యూఆర్ కోడ్‌తో భిక్షాటన చేస్తూ ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కారు దేశంలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్న విషయం తెల్సిందే. దీంతో రోడ్డు పక్కన తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకునే వారి నుంచి బడా కంపెనీల్లో డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే, వాణియంబాడి సమీపంలోని ఒక గ్రామానికి చెందిన 55 యేళ్ళ వ్యక్తి బస్టాండు, ఆలయాలతో పాటు జన సంచారం ఉండే ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ భిక్షాటనలో ప్రత్యేకత ఏంటంటే... ఈయన క్యూఆర్ కోడ్ కలిగిన ఒక కార్డును మెడలో తగిలించుకుని యాచనచేయడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తోంది. భిక్షం అడిగితే చిల్లర లేదనే సమాధానం వస్తుండటంతో ఈ క్యూర్ ఆర్ కోడ్‌ను పట్టుకుని భిక్షం అడుగుతున్నాడు. ధర్మం చేయాలని భావించే వారు తమ వద్ద చిల్లర లేకపోయినప్పటికీ ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి భిక్షం వేస్తున్నారు. వీరిలో కొందరు రూ.10, రూ.20 వరకు భిక్షం వేస్తుండటం గమనార్హం.

4 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 'కల్చరల్ ఫెస్ట్'

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు కల్చరల్ ఫెస్ట్ ఆగస్టు 4 నుంచి నవంబరు 28వ తేది వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ, ప్రాథమిక విద్య డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, 1,2 తరగతులు, 3,4,5 తరగతులు, 6,7,8 తరగతులు, 9,10 తరగతులు, 11,12 తరగతులు ఇలా ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కథలు చెప్పడం, చిత్రలేఖనం, వక్తృత్వం, తిరుక్కురల్ అప్పగించడం, గ్రామీణ నృత్యం, భరతనాట్యం, జానపద కళారూపాలు సహా పలు పోటీలు నిర్వహించనున్నారు. ముందుగా పాఠశాల స్థాయిలో ఆగస్టు 4 నుంచి 18వ తేది వరకు, సర్కిల్ పరిధిలో ఆగస్టు 25 నుంచి 29 వరకు, తాలూకా స్థాయిలో అక్టోబరు 13 నుంచి 17 వరకు, జిల్లా స్థాయిలో అక్టోబరు 27 నుంచి 31 వరకు, రాష్ట్ర స్థాయిలో నవంబరు 24 నుంచి 28వ తేది వరకు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి విజేతలకు 'కలైఅరసి', కలైఅరసన్' పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. మొదటి స్థానంలో నిలిచిన 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి విదేశాలకు విద్య విహారయాత్రకు తీసుకెళ్లనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

ఎగ్మూర్ ఆస్పత్రిలో మూడు పూటలా భోజనం

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని పిల్లల సంక్షేమ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన బంధువుల హాస్టల్‌లో, మూడు పూటలా ఉచిత భోజనం సదుపాయం కల్పించినట్టు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ.... ఎగ్మూర్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.52 కోట్లతో ఆరంతస్తులతో భవన నిర్మాణం జరుగుతుందన్నారు. వంద పడకల సామర్థ్యంతో కూడిన ఈ ఆసుపత్రి అక్టోబరు చివరి నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. గతంలో కరుణానిధి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మారథాన్ పోటీల ద్వారా వచ్చిన రూ.1.22 కోట్ల కు మరో రూ.5.81 కోట్లతో వంద మంది రోగుల బంధువులు బసచేసేలా హాస్టల్ ఏర్పాటవుతోందని, ఈ హాస్టల్‌లో బసచేసే వారికి మూడు పూటలా భోజనం సదుపాయం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

పార్టీ కార్యక్రమాల్లో బాణసంచా కాల్చొద్దు

● కార్యకర్తలకు టీవీకే సూచన

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యక్రమాల్లో బాణసంచా కాల్చవద్దని కార్యకర్తలకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) సూచించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్ విడుదల చేసిన ప్రకటనలో... 2026 అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చేపట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచారం, సభ్యత్వ నమోదుకు ఇంటింటికీ వెళ్లే కార్యకర్తలు, పార్టీ అనుమతించిన ప్రచార అంశాలు, చిత్రపటాలతో కూడిన స్టిక్కర్లు మాత్రమే వినియోగించాలన్నారు. అలాగే, అనుమతులు లేని వ్యాఖ్యలతో బ్యానర్లు ఏర్పాటుచేయడం, పార్టీ కార్యక్రమాల్లో బాణసంచా కాల్చడం తదితరాలు చేయరాదన్నారు. అలాగే, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రచార వేదికలు ఏర్పాటుచేయాలని టీవీకే సూచించింది.

గంగమ్మ ఆలయంలో ఆడి మాస పూజలు



అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా వెలియాగరం గ్రామంలో కొలువైన గంగమ్మ ఆలయంలో ఆదివారం ఆడి ఉత్సవాల సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, తెల్లవారుజామున అమ్మవారిని విశేషంగా అలంకరించగా, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రకాష్-అంబిక దంపతులు అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాహనాల దొంగలను అరెస్ట్ చేయండి

● అతిమాంజేరిపేట ప్రజల విజ్ఞప్తి

తిరుత్తణి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొదటూరుపేట సమీప ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా బైక్‌లు దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం అతిమాంజేరిపేట గాంధీనగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్ తన ఇంటి బయట బైక్ పార్క్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తి ఆ బైక్‌ను దొంగిలించాడు. మరుగసటి రోజు ఇంటి బయట బైక్ కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చర్యలు చేపట్టారు. అదే విధంగా పొదటూరుపేట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన అన్బుకు కూడా ఇదే రకమైన పరిస్థితి ఎదురైంది. అదేరోజు కోనసముద్రం గ్రామానికి చెందిన కేశవన్ పొలం పనుల నిమిత్తం బైక్‌ను రోడ్‌పై పార్క్ చేయగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌ను దొంగించారు. ఒకే రోజు వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను అరెస్టు చేయాలని స్థానిక ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

భక్తుల వద్ద నగదు వసూలు

● అర్చకులపై సస్పెన్షన్ వేటు

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తుల దగ్గర నగదు వసూలు చేసిన ఇద్దరు అర్చకులపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ ఆలయానికి వెళుతున్న భక్తుల సంఖ్య రోజరోజుకు పెరుగుతుండటంతో స్వామివారి దర్శనం కోసం గంటలు వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ఆడి అమావాస్య రోజున స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తుల దగ్గర అనధికారికంగా అర్చకులు నగదు వసూలు చేస్తుండగా ఆ దృశ్యాలు వీడియోలో రికార్డు అయ్యింది. ఈ వ్యవహారంపై వివరణ కోరుతూ సంబంధిత అర్చకులకు అధికారుల నోటీసులిచ్చారు. ఇదిలా వుండగా, త్రిసుందర బాబు, నారాయణన్ అనే అర్చకులు ఆలయ నిబంధనలు అతిక్రమించారని ఆలయ అధికారులు సస్పెండ్ చేశారు. మరలా ఉత్తర్వులు వచ్చే వరకు వారిద్దరు ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఆదేశాలు జారీ అయ్యాయి.

సబర్బన్ రైలులో చైన్ స్నాచింగ్

పెరంబూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సబర్బన్ రైలులో ప్రయాణిస్తున్న మహిళను కత్తితో బెదిరించి నగలు లాక్కొని వెళ్లిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెంగల్పట్టు సమీపంలో కాటాన్‌కొళత్తూర్ ప్రాంతానికి చెందిన తిలగం (47) ఆదివారం ఉదయం చెంగల్పట్టు నుంచి అరక్కోణంలోని పుట్టింటికి వెళ్లేందుకు సబర్బన్ రైలులో ప్రయాణించింది. తక్కోలం సమీపంలోని ఏరికరై ప్రాంతంలో సిగ్నల్ కోసం రైలు ఆగింది. ఆదివారం కావడంతో బోగీలో తక్కువ మంది ప్రయాణికులున్నారు. అంతలో ఓ యువకుడు హఠాత్తుగా కత్తి తీసి తిలగంను నగలు ఇవ్వాలని బెదిరించాడు. దిగ్భ్రాంతి చెందిన తిలగం పెద్దగా కేకలు వేసింది. అంతలో ఆ యువకుడు ఆమె ముఖంపై చేతితో దాడిచేయడం రక్తం కారింది. అనంతరం కత్తి చూపించి బెదిరించిన యువకుడు, ఆమె మెడలోని 10 సవర్ల నగలు లాక్కొని రైలు దూకి కిందకు దూకాడు. రైల్వే పోలీసులు పట్టుకునేందుకు యత్నించగా పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన రైల్వే పోలీసులు, పరారైన అగంతకుడి కోసం గాలిస్తున్నారు.

రెడ్‌హిల్స్ సమీపంలో శ్రీలంక యువకుడి అరెస్ట్

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని మొండియమ్మన్‌నగర్‌లో శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేసిన పోలీసులు పాస్‌పోర్టు లేకుండా దేశానికి వచ్చిన శ్రీలంక యువకుడిని అరెస్టు చేశారు. విదేశాలకు చెందిన పలువురు యువకులు ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ పాస్‌పోర్టు లేకుండా చట్టవిరుద్ధంగా నగరంలో సంచరిస్తున్నట్లు క్యూబ్రాంచ్ కార్యాలయానికి సమాచారం అందింది. ఈ శాఖ సూచనల మేరకు చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిలో రెడ్‌హిల్స్ సమీపంలో వున్న మొండియమ్మన్‌నగర్ చెక్‌పోస్ట్‌లో శనివారం రాత్రి సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా వేశారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న కారును ఆపి అందులోని వ్యక్తిని విచారించగా అతను శ్రీలంకకు చెందిన వ్యక్తి అని తెలిసింది. విచారణ అనంతరం అతను పాస్‌పోర్టు లేకుండా చట్టవిరుద్ధంగా నగరానికి వచ్చాడని, అతనిపై క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు లేవని తెలుసుకున్న పోలీసులు శ్రీలంక దౌత్యకార్యాలయం ద్వారా మళ్ళీ అతడిని స్వదేశానికి పంపే చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జేఎస్‌కే సతీష్ కుమార్ ప్రధాన పాత్రలో 'కుట్రం కడిదల్-2'


'కుట్రం కడిదల్-2'లో సతీష్ కుమార్

ప్రముఖ నటుడు జేఎస్‌కే సతీష్ కుమార్ ప్రధాన పాత్రలో 'కుట్రం కడిదల్-2' పేరుతో కొత్త చిత్రం తెరకెక్కనుంది. జేఎస్‌కే ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై నిర్మించే ఈ చిత్రం షూటింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ సినిమాకు స్టోరీ రైటింగ్స్‌లో సహకరించిన ఎస్‌కే జీవా దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్నారు. ఇతర పాత్రల్లో పాండియరాజన్, అప్పుకుట్టి, బాలాజీ మురుగదాస్, దీపక్, పావల్, పద్మన్, పీఎల్ తేనప్పన్, చాందిని తమిళరసన్, కీర్తి చావ్లా, విజి చంద్రశేఖర్, లల్లీన్, జోవితా లివింగ్‌స్టన్ తదితరులు నటించనున్నారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు జీవా వివరిస్తూ, 'పదవీ విరమణ దశలో ఎంతో అంకిత భావంతో పనిచేసే 60 యేళ్ళ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని కేంద్ర ప్రభుత్వం 'ఉత్తమ ఉపాధ్యాయుడు' అవార్డుతో సత్కరిస్తుంది. అతడి ఉపాధ్యాయ వృత్తికి ప్రశాంతంగా వీడ్కోలు పలకాల్సిన తరుణంలో పలు సవాళ్ళు, భావోద్వేగ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి అల్లకల్లోలమైన జీవితంలో కొట్టుమిట్టాడుతున్న ఆయన జీవితం ఎలా ముగుస్తుందన్నదే ఈ చిత్ర కథ. తమిళనాడు, కేరళ, తేని, సిరుమలై తదితర ప్రాంతాల్లో చిత్రీకరించేలా ప్లాన్ చేశాం' అని వివరించారు.

ఎమోషనల్ పాత్రలు చేయడం సవాల్

చిత్రజ్యోతి

● బిందు మాధవి



సినిమాల్లో భావోద్వేగంతో కూడిన పాత్రలు చేయడం సవాల్‌తో కూడుకున్నదని నటి బిందు మాధవి అంటున్నారు. ఏ పాత్రనైనా తన లోతైన భావోద్వేగాలతో ప్రదర్శిస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్న బిందు మాధవి తాజాగా నటించిన చిత్రం 'బ్లాక్‌మెయిల్'. త్వరలోనే విడుదలకు కానున్న ఈ చిత్రం గురించి ఆమె మాట్లాడుతూ, 'ఇది యాక్షన్ థ్రిల్లర్ మూవీ. ఎమోషనల్‌తో పాటు ఎంటర్‌టైన్మెంట్ కూడా ఉంటుంది. దర్శకుడు మారన్ ఎంతో ఉత్కంఠభరితంగా తెరకెక్కించారు. ఒక్క సినిమా రంగంలోనేకాకుండా ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుంది. దర్శకుడు మారన్ ఈ కథ చెప్పినపుడు ఎందుకనో బాగా కనెక్ట్ అయింది. నా కోసం ఎదురుచూస్తున్న పాత్రలా అనిపించింది. అందుకే ఒక్క క్షణం కూడా ఆలోచన చేయకుండా నటించేందుకు అంగీకరించాను. ఈ సినిమాలో గొప్ప పాత్ర ఇచ్చిన దర్శకుడు మారన్‌కు, జీవీ ప్రకాష్ కుమార్ సరసన నటించే అవకాశం ఇచ్చినందుకు నిర్మాతకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

మంచి చిత్రాలను నిర్మించాలన్నదే మా సంకల్పం

● నిర్మాత కలై అరసు


'హౌస్‌మేట్స్' ప్రీ రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

హీరో శివకార్తికేయన్ సొంత నిర్మాణ సంస్థ ఎస్‌కే ప్రొడక్షన్స్ పతాకంపై మంచి కథా చిత్రాలను నిర్మించాలన్నదే తమ సంకల్పమని ఆ సంస్థ సహ నిర్మాత కలై అరసు పేర్కొన్నారు.ఈ బ్యానరులో తాజాగా నిర్మించిన చిత్రం 'హౌస్‌మేట్స్'. దర్షన్, అర్ష చాందిని బైజు, కాళి వెంకట్, వినోదిని వైద్యనాథన్, దీనా, కెన్రిక్ ఆష్లే, అబ్దుల్ తదితరులు నటించగా, రాజవేల్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఆగస్టు ఒకటో తేదీ విడుదల కానున్న నేపథ్యంలో శనివారం రాత్రి నగరంలో చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దర్శకులు కేఎస్ రవికుమార్, అజయ్ జ్ఞానముత్తు అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా చూసిన తర్వాత థియేటర్ నుంచి బయటకు వచ్చి దర్శకుడు రాజవేల్‌ను హత్తుకుని, మంచి చిత్రాన్ని ఇచ్చావంటూ ప్రశంసించాను. సినిమా అంతబాగా ఉంది. ట్రైలర్‌లో కంటే సినిమాలో అనేక ఆశ్చర్యకరమైన అంశాలున్నాయన్నారు. అజయ్ జ్ఞానముత్తు మాట్లాడుతూ, 'మంచి చిత్రాన్ని నిర్మించారు. ఘన విజయం సాధిస్తుంది. ఈ సినిమాను ఎస్‌కే ప్రొడక్షన్ పతాకంపై విడుదల చేయడం విజయానికి నాంది' అన్నారు. కలై అరసు మాట్లాడుతూ, 'తమ బ్యానరులో మంచి కథలతో చిత్రాలు నిర్మిస్తూ, కొత్త నటీనటులను పరిచయం చేయాన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. ఆ కోణంలోనే 'కనా' చిత్రంతో ప్రారంభించి, ఇపుడు ఎనిమిదో చిత్రంగా 'హౌస్‌మేట్స్' రిలీజ్ చేస్తున్నామని తెలిపారు. నిర్మాత విజయ ప్రకాష్ మాట్లాడుతూ, 'దర్శకుడు రాజవేల్, నేను కాలేజీ నుంచి స్నేహితులం. అపుడు మేమిద్దరం గొడవపడలేదు. కానీ, ఈ సినిమా నిర్మాణం తర్వాత పలుమార్లు గొడవపడ్డాం. శక్తివేల్ రంగంలోకి దిగిన తర్వాత సినిమా చిత్రీకరణ సాఫీగా జరిగింది. వచ్చే నెల ఒకటో తేదీన విడుదల చేస్తున్నాం. మీ అందరి సహకారం కోరుతున్నాం' అని పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర బృందం అంతా ప్రసంగించారు.

'చట్టముమ్ నీదియుం' విజయోత్సవాలు



విజయోత్సవ వేడుకలో 'చట్టముమ్ నీదియుం' వెబ్ సిరీస్ బృందం

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో గత కొన్ని నెలలుగా 'చట్టముమ్ నీదియుం' పేరుతో రిలీజ్ చేసిన వెబ్‌సిరీస్ విజయంతంగా స్ట్రీమింగ్ అవుతోంది. దీన్ని ఇప్పటికే 51 మిలియన్ల మంది నెటిజన్లు వీక్షించారు. దీన్ని పురస్కరించుకుని ఆ వెబ్ సిరీస్‌లో నటించిన నటీనటులంతా కలిసి శనివారం నగరంలో విజయోత్సవ వేడుకలను జరుపుకున్నారు. మొదట తమిళంలో రిలీజ్ చేయగా, ఇపుడు తెలుగు, హిందీ భాషల్లో అనువదించనున్నారు. ఈ సక్సెస్ వేడుకల్లో 18 క్రియేటర్స్ తరపున నిర్మాత శశికళ ప్రభాకరన్, దర్శకుడు బాలాజీ సెల్వరాజ్, నటి నమ్మత, నటులు శరవణన్, అరోల్ డి.శంకర్, కుప్పుస్వామి, సౌందర్, సాంకేతిక నిపుణులు తదితరులు పాల్గొన్నారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన శరవణన్ మాట్లాడుతూ, '90 దశకంలో హీరోగా పరిచయమైన రోజుల్లో నాకు మీడియా ఎంతగానో సపోర్టు చేసింది. ఇపుడు ఈ వెబ్ సిరీస్ ఇంతటి ఘన విజయం సాధించడానికి కూడా మీడియానే కారణం. నాతో పాటు ఎంతగానో శ్రమించిన ప్రతి ఒక్క కళాకారుడికి ధన్యవాదాలు' తెలిపారు. దర్శకుడు బాలాజీ సెల్వరాజ్ మాట్లాడుతూ, 'ఈ అవకాశాన్ని నటుడు సూరి ఇచ్చారు. నిర్మాతలు ప్రభాకరన్, శశికళ ప్రభాకరన్ ఈ సిరీస్ కోసం ఎంతగానో శ్రమించారు. నమ్రిత చాలా బాగా నటించింది. ఈ వెబ్ సిరీస్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు.

అంగరంగ వైభవంగా బోనాల జాతర

● సందడి చేసిన తెలంగాణ ఆడపడుచులు
● ఎల్లమ్మ నామస్మరణతో మార్మోగిన షావుకారుపేట


బోనాలతో తెలంగాణ ఆడపడుచులు


బోనాల జాతరలో మంత్రి పీకే శేఖర్‌బాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో తృతీయ వార్షిక బోనాల జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక షావుకారుపేట నుంచి కొండితోపు ప్రాంతాలోని వీధులు ఎల్లమ్మ నామస్మరణతో మార్మోగాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణా కుటుంబాలకు చెందిన ఆడపడుచులు సంప్రదాయ వస్త్రధారణతో, బోనాలతో ఎల్లమ్మ తల్లి జాతరలో కుల, మతాలకతీతంగా పాల్గొన్నారు. షావుకారుపేట మింట్ స్ట్రీట్‌లోని రేణుక పరమేశ్వరి ఆలయంలో ఉదయం 9.20 గంటలకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు బోనాల ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజధాని నగరంలో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు తెలుగు సంప్రదాయంగా వస్తున్న బతుకమ్మ, బోనాల పండుగలను ఘనంగా జరుపుకుంటున్నారని, ఈ వేడుకల్లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ పండగలు జరుపుకునేందుకు తమవంతు సహకారం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కాగా, యాదాద్రి జిల్లాకు చెందిన తుప్పతి విజయ్‌కుమార్ ఒగ్గు కళాకారుల బృందం డప్పు మోగించి జానపద నృత్యాలతో సందడి చేశారు. శివశక్తులు, పోతురాజుల విన్యాసాలతో షావుకారుపేట నుంచి కొండితోపు వీధులన్నీ కళకళలాడాయి. ఆషాఢ బోనాల ఊరేగింపు కొండితోపు పార్క్ సమీపంలోని ఆదిశక్తి అమ్మవారి ఆలయం వద్ద ముగిసింది. ప్రత్యేక హారతి, మంత్రోచ్ఛారణ, మేళతాళాల మధ్య తెలంగాణ ఆడపడుచులు అమ్మవారికి కుంకుమ, వేప, పసుపు కొమ్ములు నైవేద్యంతో పాటు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో సంఘం నిర్వాహకుల కుటుంబాలు, చెన్నై తెలంగాణ కుల సంఘాల నాయకులు, డీఎంకే ప్రముఖులు ఎస్.మురళి, అపరంజి, అన్నాదురై తదితరులు పాల్గొన్నారు. భక్తులందరికీ మజ్జిగ, మంచినీరు, తీర్థ, అన్నప్రసాదాలను నిర్వాహకులు పంపిణీ చేశారు.




తలపై బోనాలు పెట్టుకొని సందడి చేస్తున్న భక్తులు - ఒగ్గు కళాకారుల బృందం నాయకుడు విజయ్‌కుమార్ విన్యాసం - పోతురాజుల విన్యాసాలు

ఘనంగా అక్షరయాన్ మాతృవందనం

● ఇద్దరు రచయిత్రులకు సన్మానం


వసుంధర, సుజాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

అడయార్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'అక్షరయాన్ మాతృవందనం' కార్యక్రమంలో భాగంగా నగరంలోని రచయిత్రులకు అక్షరయాన్ నిర్వాహకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మానం పొందిన వారిలో డాక్టర్ వసుంధర, లింగమనేని సుజాత ఉన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి యేటా అక్షరయాన్ సంస్థ 'అక్షరయాన్ మాతృవందనం' పేరుతో రచయిత్రుల సన్మాన కార్యక్రమం శ్రీలక్ష్మి అయినంపూడి ఆధ్వర్యంలో గత మూడేళ్ళుగా విజయవంతంగా సాగుతోంది. ఈ యేడాది దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది రచయిత్రులను ఎంపిక చేసి సత్కరించారు. అయితే, వయసు, ఆరోగ్య రీత్యా ప్రత్యక్షంగా మాతృవందనం కార్యక్రమంలో పాల్గొనలేని వారికి ఆయా రాష్ట్రాల్లోనే సన్మానిస్తున్నారు. ఇందులోభాగంగా, చెన్నైలో ఉంటున్న రచయిత్రులు డాక్టర్ వసుంధర, లింగమనేని సుజాతను సన్మానించారు. సన్మాన వేడుకకు సీతాస్ చారిటబుల్ ట్రస్ట్, అభిజ్ఞా భారత్ ఆర్గనైజేషన్ కూడా తమవంతు సహకారం అందించాయి. లేళ్ళపల్లి శ్రీదేవి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో అక్షరయాన్ చెన్నై సభ్యులైన రచయిత్రులు డాక్టర్ తిరుమల ఆముక్తమాల్యద, బాలాంత్రపు లావణ్య, లేళ్ళపల్లి శ్రీదేవి రమేష్, రాజధాని కళాశాల పూర్వ ఆచార్యులు, సీనియర్ కవి, రచయిత ఆచార్య లింగమనేని బసవ శంకర రావు, డాక్టర్ శశికళ దంపతులు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘననివాళి

● రామేశ్వరంలో సర్వమత ప్రార్థనలు


అబ్దుల్ కలాం స్మారక మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి డా.ఏపీజే అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని పేకరుంబులో ఉన్న అబ్దుల్ కలాం జాతీయ స్మారక మందిరంలో ఆయన కుటుంబ సభ్యులు జైనుల్లా అబుద్దీన్, నజీమా మరకయ్యన్, నిజాం, షేక్ దావూద్, షేక్ సలీం, ఆవుల్‌మీరా తదితరులు పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాధి వద్ద సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. రామేశ్వరం జమాత్ అధ్యక్షుడు మహ్మద్ నాజర్, బీజేపీ జాతీయ మైనారిటీ కార్యదర్శి ఇబ్రహీం, చర్చి పాదర్లు పాల్గొని విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రార్థించారు. అలాగే భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మెన్ నారాయణన్, రామనాథపురం జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ కాలోన్, తహసీల్దార్ అబ్దుల్ జాఫర్ తదితరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కలాంకు నివాళులర్పించారు. అదేవిధంగా రామేశ్వరం వెళ్ళిన పర్యాటకులు, భక్తులు, విద్యార్థులు కూడా అంజలి ఘటించారు. అబ్దుల్ కలాం అంతర్జాతీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేకరుంబు ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

మేల్ మరువత్తూరులో వైభవంగా ఆడిపూరం వేడుకలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమ్మవార్లు కొలువైవున్న ఆలయాల్లో ఆదివారం అమ్మవారికి సారె సమర్పించే ఆడిపూరం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రం ఆడిపూరం కావడంతో ముత్తయిదువులు అమ్మవార్ల ఆలయాలకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి క్షీరాభిషేకంలో పాల్గొన్నారు. తిరుచ్చి జిల్లాలోని సమయపురం మారియమ్మన్ ఆలయం, మదురై మీనాక్షి ఆలయం, కాంచీపురం కామాక్షి ఆలయం, మాంగాడు కామాక్షి ఆలయం, తిరువేర్కాడు దేవి కరుమారియమ్మన్ ఆలయం, తిరువొత్తియూర్ వడివుడయమ్మన్ అమ్మవారి ఆలయం, మైలాపూర్ ముండకన్ని అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ మాసంలో చివరి ఆదివారం రోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కాగా, చెంగల్పట్టు జిల్లాల్లోని మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి పీఠం ఆధ్వర్యంలో 54వ వార్షిక ఆడిపూరం వేడుకలు ఈ నెల 26న ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఆడిపూరం సందర్భంగా లక్ష్మీ బంగారు అడిగలార్ కలశ పూజ, దీప పూజ, పాదపూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన క్షీరాభిషేకంలో ముత్తయిదువులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రిటైర్డ్ న్యాయమూర్తులు మురుగేశన్, రాజేశ్వరన్, దక్షిణరైల్వే మాజీ జనరల్ మేనేజర్ జయంత్, డ్రమ్స్ శివమణి తదితరులను పీఠాధిపతులు అన్బళగన్, సెంథిల్‌కుమార్, శ్రీదేవి రమేష్ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

66 అడుగులకు పెరిగిన వైగై డ్యాం నీటిమట్టం

మొదటి వరద హెచ్చరిక


నిండుకుండలా వైగై డ్యామ్

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో ఉన్న వైగై డ్యామ్ నీటిమట్టం 66 అడుగులకు చేరటంతో ఇరిగేషన్ అధికారులు డ్యామ్ సమీప ప్రాంతాల్లో ఉన్నవారికి మొదటి వరద హెచ్చరిక జారీ చేశారు. కేరళలో భారీ వర్షాల కారణంగా ఈ డ్యామ్‌లో నీరు రోజురోజుకూ పోరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం డ్యామ్ నీటిమట్టం 66.27 అడుగులకు చేరింది. దీంతో తేని, దిండుగల్, మదురై, శివగంగ, రామనాథపురం జిల్లాల్లో వైగై కాలువ సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మొదటి వరద హెచ్చరికలు చేశారు. వైగై డ్యామ్‌లో నీటిమట్టం 68.50 అడుగులకు చేరితే రెండో విడత వరద హెచ్చరిక, 69 అడుగులుదాటితే మూడో వరద హెచ్చరిక చేస్తామని అధికారులు తెలిపారు.

అట్టహాసంగా ముగిసిన రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాలు


కాశీ నుంచి తీసుకొచ్చిన గంగాజల కలశాన్ని తీసుకెళుతున్న మోదీ


ఆవుడయార్‌కు దీపారాధన చేస్తున్న మోదీ- ప్రధాని మోదీకి ఆశ్వీరచనాలు చేసి జ్ఞాపిక అందజేస్తున్న చిదంబరం ఆలయ దీక్షితార్లు

అడయార్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గంగైకొండ చోళపురం ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాజేంద్ర చోళుడి జయంత్యుత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. ముగింపు వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనటంతో ఈ వేడుకలకు మరింత ప్రాధాన్యం చేకూరింది. అరియలూరు జిల్లాలోని గంగైకొండ చోళపురం బృహదీశ్వర ఆలయంలో ఆదివారం ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఆధ్యాత్మిక సంగీత ప్రదర్శన నిర్వహించగా, దానిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆస్వాదించారు. బృహదీశ్వరాలయ ప్రాంగణంలో కేంద్ర సాంస్కృతిక శాఖ 'ముప్పెరుమ్ విళా' వేడుకల్లో భాగంగా, ఆడి తిరువాదిరై, రాజేంద్ర చోళుడి జయంతి వేడుకలు, గంగైకొండ చోళపురం బృహదీశ్వర ఆలయ వెయ్యేళ్ళ వార్షికోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళయరాజా సారథ్యంలో సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. ఇళయరాజా బృందం 'నాన్ కడవుల్ చిత్రంలోని 'ఓం శివహోం' పాటను ఆలపించగా, ప్రధాని మోదీ తన్మయత్వం చెందారు. అలాగే, ఇళయరాజా స్వరపరిచిన తిరువాసకం ఆల్బమ్‌లోని 'మానస్ర జ్యోతి' అనే పాటను ఇళయరాజా స్వయంగా ఆలపించారు. రాజేంద్ర చోళుడి జయంత్యుత్సవాల్లో రాష్ట్రం నలమూలల నుండి 25 మందికి పైగా మఠాధిపతులు విచ్చేశారు. ఈ వేడుకలకు మోదీకి చోళీశ్వరాలయంలో ఘనస్వాగతం లభించింది. వివిధ సన్నిధుల వద్ద దేవతామూర్తులను దర్శించుకున్నారు. తన నియోజకవర్గం కాశీ నుండి తెప్పించిన గంగాజలాన్ని ఆవుడయార్‌కు సమర్పించగా, ఆలయ ప్రధానార్చకులు ఆయనకు ప్రసాదాలను అందజేశారు. ఆ సందర్భంగా ప్రధాన పూజారి విభూతిని, కుంకుమ మోదీ నొసటన పెట్టి స్వామివారి పవిత్రమాలను వేశారు. శైవ దర్శనం తర్వాత ఉత్సవాల సభావేదిక వద్దకు వెళ్ళిన మోదీకి బీజేపీ, అన్నాడీఎంకే పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఇందులో ముందుగా రూ.1000ల రాజేంద్రచోళుడి స్మారక నాణెం ప్రధాని విష్కరించారు. ఆ తర్వాత ఓదువార్లు పరమేశ్వరుడిని కీర్తిస్తూ చేసిన గానానికి మోదీ ముగ్ధులయ్యారు. సుమారు రెండున్నర గంటలపాటు ఈ వేడుకలు కొనసాగాయి. శైవపండితులు, ఆలయ ప్రధానార్చకులను కూడా మోదీ ప్రత్యేకంగా కలుసుకుని వారికి అభినందనలు తెలియజేశారు. ఈ వేడుకల అనంతరం హెలిపాడ్ వద్దకు కారులో బయలుదేరిన మోదీకి రహదారికి ఇరువైపులా నిలిచిన బీజేపీ, అన్నాడీఎంకే కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు.


ఎగ్జిబిషన్ సందర్శిస్తున్న మోదీ